క్లుప్తంగా

భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడి బహిష్కరణ

బెల్లంపల్లి: తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) బెల్లంపల్లి ఏరియా అధ్యక్షుడు దాసరి బానయ్యను సంఘం నుంచి బహిష్కరించినట్లు ఆ సంఘం బెల్లంపల్లి ఏరియా వర్కింగ్ ప్రెసిడెంట్ నాతరి స్వామి, ప్రధాన కార్యదర్శి ఎల్తూరి శంకర్, ఉపాధ్యక్షుడు ఆవునూరి రాజు, కోశాధికారి చిప్పకుర్తి బాపు ఒక ప్రకటనలో తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నియమ నిబంధనలను ఉల్లంఘించడం, ఆర్థిక అరాచకత్వానికి పాల్పడటంతో అనివార్యంగా అధ్యక్షుడిని సంఘం నుంచి బహిష్కరించాల్సి వచ్చిందని ప్రకటించారు. అధికార బీఆర్ఎస్ పార్టీతో కుమ్మక్కై సంఘాన్ని చీల్చడానికి ప్రయత్నాలు చేశాడని, సంఘం లెక్కలు చెప్పకుండా తప్పించుకు తిరుగుతున్నట్లు పేర్కొన్నారు. బానయ్య కుట్రలను సభ్యులు అర్థం చేసుకుని, సంఘం పటిష్టతను కాపాడటానికి కృషి చేయాలని కోరారు.

రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్పీవో

జన్నారం: మండలంలోని కామన్‌పల్లి గ్రామ పంచాయతీని డీఎల్పీవో ప్రభాకర్‌రావు ఆదివారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. అభివృద్ధి, పనుల వివరాలను సర్పంచ్ మానసను అడిగి తెలుసుకున్నారు.

ఎల్లారం పోచమ్మకు మొక్కులు



ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

భీమిని: కన్నెపల్లి మండలంలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బెల్లం, కల్లు శాకలతో పాటు కోళ్లు, మేకలు బలిచ్చి మమ్మల్ని సల్లంగా చూడు తల్లి అంటూ వేడుకున్నారు. అనంతరం ఆలయ పరిసరాల్లోని చెట్ల కింద వంటావార్పు చేసుకొని, సహపంక్తి భోజనాలు చేశారు.

బీజేపీని ఆదరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

మందమర్రిరూరల్: పట్టణంలోని యాపల్ ఏరియాలో ఆదివారం బీజేపీ నాయకులు ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్ తొమ్మిదేళ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి బీజేపీని ఆదరించాలని కోరారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేష్, నాయకులు దుర్గరాజ్, రంజిత్, సత్యంబాబు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.60
పచ్చిమిర్చి	80
వంకాయ	50
కాకరకాయ	80
బెండకాయ	40
అలసంద	50
దొండకాయ	80
సోరకాయ	50
ఆకుగోబి	60
పూగోబి	80
క్యారెట్	80
క్యాప్సికం	90
పాలకూర	40
తోటకూర	40
ములక్కాయ	100

- మంచిర్యాలఅగ్రికల్చర్



బోధనలో భేష్..!

- చెన్నూర్ ప్రభుత్వ కళాశాలలో మెరుగైన ఫలితాలు
- రాష్ట్ర, జిల్లా స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు



విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

చెన్నూర్: చదువులమ్మ ఒడిలో సేదతీరిన విద్యార్థులు చక్కటి ర్యాంకులు సాధిస్తున్నారు. సర్కార్ చదువులంటే చులకనగా చూస్తున్న ఈ రోజుల్లో, చదువులో మాకు మేమే పోటీ అని పరీక్షల్లో చక్కని ప్రతిభ కనబర్చి మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఘన చరిత్ర ఉంది. ఈ కళాశాలలో విద్యాభ్యాసం చేసిన వారెందరో నేడు దేశ విదేశాల్లో ఉన్నత హోదాల్లో ఉన్నారు. నాటి ఫలాలను నేడు విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో అధ్యాపకులు సమష్టిగా కృషి చేస్తున్నారు. మూడేళ్లుగా ఆ కళాశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు చక్కటి ఫలితాలు సాధిస్తున్నారు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించడమే కాకుండా శ్రీకాంత్ అనే విద్యార్థి రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించి కళాశాల పేరు ప్రతిష్టతను రాష్ట్ర స్థాయిలో నిలిపాడు. కళాశాల విద్యార్థులు సాధిస్తున్న ఫలితాల పై ప్రత్యేక కథనం.

ఉత్తమ ఫలితాలు...

చెన్నూర్ ప్రభుత్వ కళాశాలలో 82మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. మూడేళ్లుగా కళాశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఈ ఏడాది సీఈసీ ద్వితీయ సంవత్సరంలో ఎ.శ్రీకాంత్ అనే విద్యార్థి రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంక్ సాధించాడు. భవాని అనే విద్యార్థిని సైన్స్ గ్రూప్‌లో 974మార్కులు సాధించి జిల్లాలో టాపర్‌గా నిలిచింది. చెన్నూర్ ప్రభుత్వ కళాశాలలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులంతా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే. చెన్నూర్ మండలంతో పాటు కోటపల్లి, వేమనపల్లి మండలాల విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రతిరోజు ఆర్టీసీ బస్సుల్లో వచ్చి చదువుకుంటున్న విద్యార్థులు, అమోఘమైన ఫలితాలు సాధించి ఇటు కళాశాలకు, అటు వారి స్వగ్రామానికి పేరు తెస్తున్నారు.

200ఏళ్ల చరిత్ర...

చెన్నూర్ ప్రభుత్వ కళాశాలకు ఘన చరిత్ర ఉంది. కళాశాల చరిత్ర ఘనంతో పాటు అభ్యాసం అద్భుతంగా సాగింది. ఈ కళాశాలలో విద్యాభ్యాసం చేసిన వారెందరో దేశ విదేశాల్లో ఉన్నత హోదాల్లో ఉన్నారు. నాటి నుంచి నేటి వరకు ఈ కళాశాలలో విద్యాభ్యాసం చేసిన వారిలో సుమారు 15మందికి పైగా డాక్టర్లు, 30మందికి పైగా అమెరికా, లండన్ లాంటి దేశాల్లో ఉన్నత హోదాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. చెన్నూర్‌లో గతంలో పని చేసిన ఎంఈవోలతో పాటు ప్రస్తుత ఎంఈవో రాధాకృష్ణమూర్తి చెన్నూర్ కళాశాలలో విద్యాభ్యాసం చేసిన వారే. వీరే కాకుండా మరెందరో శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, కవులు, కళాకారులు, రచయితలుగా ఎదిగారు. ఇంతటి చరిత్ర కల్గిన కళాశాల పూర్వ వైభవాన్ని తీసుకొని వచ్చేందుకు, ప్రస్తుత అధ్యాపక బృందం సమష్టిగా కృషి చేస్తోంది.

అనుభవం కల్గిన అధ్యాపకులు..

అనుభవం కలిగిన అధ్యాపకులు విధులు నిర్వరిస్తూ, క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నారు. విద్యతో పాటు వివిధ రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఎస్ఎస్ఎస్‌తో పాటు ఎంసెట్‌లో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్ట్‌లలో వెనుకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు.

లెక్చరర్ల కృషి బాగుంది..



కళాశాలలో మంచి ఫలితాలు రావడానికి లెక్చరర్ల కృషి బాగుంది. అర్థం అయ్యేలా విద్యా బోధన చేస్తున్నారు. సబ్జెక్ట్‌లు సకాలంలో పూర్తి చేసి రివిజన్ నిర్వహిస్తున్నారు. ఎంసెట్, ఇతర కోర్సుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అధ్యాపకుల కృషితో నేను రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్ సాధించాను.

– ఆత్కూరి శ్రీకాంత్, ఇంటర్‌లో స్టేట్ మూడో ర్యాంక్

క్రమశిక్షణతో కూడిన విద్య..



కళాశాల క్రమశిక్షణకు మారు పేరు. అధ్యాపకులు క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తున్నారు. విద్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నారు. గ్రామీణ విద్యార్థులకు సైన్స్ గ్రూప్ అంటేనే భయం వేస్తుంది. ప్రతి విద్యార్థి వారికి ఆసక్తి ఉన్న గ్రూప్‌లో ఫలి తాలు సాధించేలా తీర్చిదిద్దుతున్నారు.

– భవాని, కళాశాల విద్యార్థిని

ప్రభుత్వ కళాశాలకు రండి



మా కళాశాలకు రండీ నాణ్యమైన విద్యనందిస్తాం. ఎంసెట్‌లలో ప్రత్యేక తరగతుల నిర్వహణ. విద్యతో పాటు సామాజిక కార్యక్రమాలపై అవగాహన సదస్సులు. కళాశాలలో సమష్టి కృషితో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాం.

– నాగచందర్‌రావు, ప్రిన్సిపాల్, చెన్నూర్

సమాచారం

నేడు హరిత దినోత్సవం

బెల్లంపల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం బెల్లంపల్లి మున్సిపాలిటీలో హరిత దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం 10గంటలకు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, పురప్రజలు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

22న వాహనాలు వేలం

బెల్లంపల్లి: ఎక్సైజ్ నేరాలలో పట్టుబడి జప్తు చేసిన ద్విచక్ర వాహనాలకు ఈ నెల 22న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ఎక్సైజ్ సీఐ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు బెల్లంపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ నేరాలలో పట్టుబడి జప్తు చేసిన 13దిచక్ర వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో వేలం పాట ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. వేలంలో పాల్గొనదలిచిన వ్యక్తులు వాహన విలువలో 50శాతం ఈఎండీగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ముందస్తుగా దిచక్ర వాహనాలను పరిశీలించుకోవడానికి ఇతర సమాచారం కోసం ఆసక్తి కలిగిన వ్యక్తులు ఎక్సైజ్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

22న కన్నెపల్లి మండల సమావేశం

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 22న గురువారం మధ్యాహ్నం 2గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాధాకిషన్ తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు తమతమ నివేదికలతో తప్పక హాజరుకావాలని సూచించారు.

'ఎల్లంపల్లి' నిర్వాసితులకు అండగా ఉంటాం



వినతిపత్రాలు తీసుకుంటున్న రామ్మోహన్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని ఎల్లంపల్లి నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, నిర్వాసితులకు అండగా ఉంటామని రాష్ట్ర ఫిలిం బోర్డు మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పూస్కూరు రామ్మోహన్‌రావు తెలిపారు. హాజీపూర్ మండలానికి ఆదివారం వచ్చిన ఆయనను నిర్వాసితులు కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కొండపల్లి, కర్ణమామిడి, చందనాపూర్ గ్రామాలకు చెందిన నిర్వాసితులకు ఇళ్ల స్థలాలకు బదులుగా ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ప్యాకేజీ కింద ఒక్కొక్కరికీ రావాల్సిన రూ.3.75 లక్షలు అందేలా చూడాలని విన్నవించారు. ఈ క్రమంలో ఇంటి అడుగు కింద అందాల్సిన ప్యాకేజీలో భాగంగా కొండపల్లిలో 59, చందనాపూర్‌లో 53, కర్ణమామిడిలో 12 మందికి ఈ పరిహారం అందాల్సి ఉందని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల కింద పరిహారంగా అందాల్సిన రూ.70 వేలు కూడా త్వరగా ఇప్పించేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఎల్లంపల్లి నిర్వాసితుల సమస్యలను పూర్తిగా పరిష్కారమయ్యేలా సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ బొడ్డు శంకర్, బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు దొమ్మటి సత్తయ్య, నాయకులు జూపాక ధర్మయ్య, కొట్టె మనోహర్, ఆకుల రాము పాల్గొన్నారు.

భక్తులకు సేవలందించేందుకు కృషి చేయాలి


- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



పాలకవర్గాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: అమ్మవారి సేవకు, దర్శనానికి వచ్చిన భక్తులకు సేవలందించేందుకు ఆలయ కమిటీ పాలకులు కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. మండలంలో ఆదివారం చింతగూడ లక్ష్మీదేవి ఆలయం నూతన చైర్మన్ మల్లేశ్‌తో పాటు పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాలక వర్గ సభ్యులను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సుదూర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అమ్మవారి సన్నిధిలో సేవచేసే అవకాశం దొరకడం అదృష్టంగా భావించాలన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, రైతుబంధు సమితి అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజన్న, మార్కెట్ కమిటీ జిల్లా డైరెక్టర్ భరత్‌కుమార్, మాజీ చైర్మన్ సతీశ్‌కుమార్, నాయకులు జనార్దన్, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు



మంచిర్యాల	
శ్రీనివాస	: ఆదిపురుష్
వెంకటేశ్వర	: ది ఫ్లాష్
జెమిని సినిమా స్క్రీన్ 1	: ఆదిపురుష్/ ది ఫ్లాష్
జెమిని సినిమా స్క్రీన్ 2	: ఆదిపురుష్/ విమానం
లక్సెట్టిపేట	
మహానంద	: ఆదిపురుష్
జన్నారం	
రాఘవేంద్ర	: ఆదిపురుష్
చెన్నూర్	
శ్రీశ్రీనివాస	: ఆదిపురుష్
బెల్లంపల్లి	
రామకృష్ణ	: ఆదిపురుష్
బాలాజీ	: యూనివర్సిటీ
సీసీసీ	
దేవి	: ఆదిపురుష్
తిరుమల	: ఆదిపురుష్

- మంచిర్యాలటౌన్

'సింగరేణి ఎన్నికల్లో టీఎస్టీయూసీ ఒంటరిగా పోటీ'



అభివాదం చేస్తున్న టీడీపీ నాయకులు

మందమర్రిరూరల్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో టీఎస్టీయూసీ ఒంటరిగా పోటీ చేస్తుందని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు, టీఎస్టీయూసీ ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. స్థానిక టీఎస్టీయూసీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి నిధులన్నీ అభివృద్ధి పేరిట బీఆర్ఎస్ ఎమ్మెల్యేల జేబుల్లోకి వెళ్తున్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ఈ సందర్భంగా టీఎస్టీయూసీ అనుబంధ కార్మిక సంఘమైన ఎస్సీఎల్‌యూ అధ్యక్షుడిగా పెద్దపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఠాకూర్ మణిరాం సింగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు జక్కుల సమ్మయ్య, నారాయణ, రాజయ్య, లక్ష్మీరాజం, రాజు, హుస్సేన్, విజయ తదితరులు ఉన్నారు.

'తాగునీరు సక్రమంగా అందించేందుకు కృషి'



మంచిర్యాలటౌన్: ముల్కల్ల ఫిల్టర్ బెడ్ వద్ద నీటి శుద్ధిని పరిశీలిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్లు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో ప్రతి ఇంటికీ సక్రమంగా తాగునీటిని అందించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య అన్నారు. దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం మంచినీటి పండుగ సందర్భంగా మున్సిపాలిటీకి తాగునీటిని అందించే ముల్కల్ల ఫిల్టర్ బెడ్‌లోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా తాగునీటిని గోదావరి నది నుంచి సేకరించి, శుద్ధి చేసిన అనంతరం వాటర్ ట్యాంకుల ద్వారా పట్టణ ప్రజలకు ఏ విధంగా సరఫరా చేస్తున్నారో మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మున్సిపల్ ఇంజనీర్ మధుకర్, ఏఈ రాజేందర్ వివరించారు. మున్సిపాలిటీలోని 10, 11, 26, 27, 28వార్డుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, బోర్లు ఎండిపోవడం, మున్సిపల్ నీరు రాకపోవడంతో కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వార్డు కౌన్సిలర్లు వాపోయారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య మాట్లాడుతూ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మంచినీళ్ల పండుగను జరుపుకోవడంపై వార్డు కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తితో ఉండడం గమనార్హం. ప్రజలకు నిరంతరం తాగునీటిని అందించిన తరువాతనే, ఇలాంటి పండుగలను జరుపుకుంటే బాగుంటుందనే అభిప్రాయాన్ని మెజారిటీ కౌన్సిలర్లు వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్రమాల్లో అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు గైర్హాజరవుతుండగా, మహిళా కౌన్సిలర్ల స్థానంలో భర్తలు మాత్రమే తరుచూ కార్యక్రమాల్లో పాల్గొంటున్నా, అధికారులు గాని, పాలకవర్గం గాని చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఊరూరా మంచినీళ్ల పండుగ



నర్సింగాపూర్‌లో ముగ్గుల పోటీ



జనగామలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు



కొత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు



తాండూర్: పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రజలకు మంచినీటి ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు చేపట్టారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రభుత్వం ఇంటింటా తాగునీటిని అందిస్తోందని తెలిపారు. పట్టణ, పల్లె ప్రాంతాల ప్రజలకు రక్షిత మంచినీటి పథకాన్ని సరఫరా చేస్తూ దాహార్తిని తీరుస్తోందని పేర్కొన్నారు. నీళ్ల ట్యాంకుల వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. సేవ్ వాటర్ ప్రతిజ్ఞ చేశారు. కోటపల్లి మండలంలో మంచినీళ్ల పండుగను నిధుల లేమి సమస్యతో మొక్కుబడిగా నిర్వహించారు. మిషన్ భగీరథ అధికారులే హాజరుకాకపోవడం గమనార్హం. కోటపల్లిలోని 31గ్రామ పంచాయితీలకు 15లడ్డులను పంపిణీ చేయగా కనీసం అవి ఏ ఒక్క గ్రామ పంచాయతీల్లో పంచకపోవడంతో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



నెన్నెల: బహుమతి అందిస్తున్న సర్పంచ్



బెల్లంపల్లిరూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు



సారంగపల్లిలో ర్యాలీ



దండేపల్లి: తాళ్లపేటలో సేవ్ వాటర్ ప్రతిజ్ఞ



కిష్టంపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్, ప్రజలు

విశ్వకర్మ మహాసభ నూతన కమిటీ

దండేపల్లి: అఖిల భారత విశ్వకర్మ మహాసభ దండేపల్లి పట్టణ నూతన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్నాథం ఆదేశాల మేరకు నియమించినట్లు మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్ట వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్ తెలిపారు. అధ్యక్షుడిగా నూతుల శ్రీకాంత్‌చారి, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ చారి, శ్రీనివాస చారి, ప్రధాన కార్యదర్శిగా భీమోజీ కర్ణచారి, కోశాధికారిగా శ్రీధర్ చారి, ప్రచార కార్యదర్శిగా వెంకటేశ్‌చారి, సభ్యులుగా దేవయ్య, రాజేశం, తిరుపతి, సత్తన్న, లక్ష్మీనారాయణను నియమించినట్లు తెలిపారు.

సీఐటీయూ ఏరియా కార్యవర్గం

శ్రీరాంపూర్: ఏరియా సీఐటీయూ కమిటీని ఆదివారం ఆ యూనియన్ కార్యాలయం వద్ద యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి సమక్షంలో ఎన్నుకున్నారు. ఏరియా గౌరవ అధ్యక్షుడిగా మిడివెల్లి శంకర్, అధ్యక్షుడిగా బాలాజీ, కార్యదర్శిగా భాగ్యరాజ్, కోశాధికారిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా బోడకుంట శంకర్, సుధాకర్, సదానందం, మిడివెల్లి శ్రీనివాస్, శ్రీధర్, అశోక్, సాగర్‌తో పాటు ఆర్గనైజర్స్‌గా అజయ్, రాజయ్య, కేసిపెద్ది శ్రీనివాస్, అభిలాష్, శ్రీ. దర్, మహేష్, ప్రణీత్, ప్రవీణ్, రాజగోపాల్, సతీశ్, సమ్మయ్య, యాదగిరిని ఎన్నుకున్నారు.